క్లుప్తంగా

ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రచారం

ధర్మసాగర్ : రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ (టీఎస్)రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని ఆ సంఘం నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని మల్లక్‌పల్లి, పెద్ద పెండ్యాల, దేవునూర్, ఉనికిచర్ల, ధర్మసాగర్, సాయిపేట పాఠశాల, కళాశాలలో మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మండల తిరుపతిరెడ్డి, ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జాన్‌సింగ్ ఓట్లను అభ్యర్థించారు. ఉపాధ్యాయుల పరిష్కారానికి పీఆర్టీయూ పోరాటం చేస్తుందని, ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు రమేష్, సత్యనారాయణరెడ్డి, నవీన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి, నాయక్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సరస్వతి, మండల ఉపాధ్యక్షురాలు తులసి, అశోక్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్



నడికూడ : పెండింగ్ బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి గుడి నుంచి సెక్రటేరియట్ వరకు చేపట్టే ర్యాలీకి వెళ్తున్న మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీస్‌లు తెలిపారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సాంబశివరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఊర రవీందర్ రావు, సదానందం, బొట్ల రవీందర్‌ను పరకాల పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కాల్వలోకి దూసుకెళ్లిన లారీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ సమీపంలో గల జాతీయ రహదారిపై ఫ్లైయాష్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వలన ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

మహిళకు గాయాలు

నడికూడ : కదులుతున్న బస్సు నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కంఠాత్మకూరు వద్ద సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన మహిళ పరకాల నుంచి కంఠాత్మకూరుకు వెళ్లేందుకు హనుమకొండ బస్సు ఎక్కింది. కంఠాత్మకూరు హనుమాన్ గుడి వద్ద బస్సు ఆగడంతో ప్రయాణికులు ఎక్కారు. సదరు మహిళ ఆలస్యంగా తన బస్‌స్టాప్‌ను గుర్తించి బస్సు దిగేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో జారీ పడడంతో గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీస్‌లు తెలిపారు.

'భద్రయ్య సేవలు గొప్పవి'



ధర్మసాగర్ : నాలుగు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో, వివిధ ప్రాంతాల్లో పనిచేసిన భద్రయ్య సేవలు గొప్పవని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ధర్మప్రకాశ్ కొనియాడారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసిన భద్రయ్య ఉద్యోగ విరమణ అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ధర్మప్రకాశ్ మాట్లాడుతూ.. పనిచేసిన ప్రతిచోట ఉపాధ్యాయులు, విద్యార్థుల అవసరాలు తీర్చటంలో భద్రయ్య శ్రమించేవాడని అన్నారు. అనంతరం అతడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కవితాదేవి, సురేశ్, పద్మజ, రాజమ్మ, కిరణ్మయి, రామకృష్ణ, ప్రసన్న, సుధీర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శాస్త్రోక్తంగా అనఘాష్టమి వ్రతం

ఖిలా వరంగల్: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో అనఘాష్టమి వ్రత పూజను ఆలయ ప్రధాన పూజారి శివరామకృష్ణ చార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు పూజా సామగ్రితో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, ఆడెపు శ్యామ్, నవీన్, యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' ప్రయత్నం అభినందనీయం

- ఎంజేపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సౌజన్య



కమలాపూర్ : స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

కమలాపూర్ : స్పెల్‌బీ పరీక్ష ద్వారా విద్యార్థుల టాలెంట్ బయట పడుతుందని, స్టాండర్డ్స్ చాలా బాగున్నాయని, పోటీ పరీక్షల శిక్షణకు కొన్నేళ్లుగా సాక్షి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కమలాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వి.సౌజన్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో సాక్షి ఆధ్వర్యంలో సోమవారం స్పెల్‌బీ పరీక్ష నిర్వహించారు. ఇంగ్లిష్ విభాగంలో నిర్వహించిన ఈ పరీక్షకు 11 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంగ్లిష్‌కు సంబంధించి విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసేందుకు, పదజాలం మెరుగుపర్చుకునేందుకు సాక్షి స్పెల్‌బీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించడం ద్వారా విద్యార్థులకు భవిష్యత్‌తో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడుతాయని అన్నారు. అరుదుగా వచ్చే ఇలాంటి అవకాశాలను విద్యార్థినులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు కల్యాణి పాల్గొన్నారు. స్పెల్‌బీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

ఆసక్తికరంగా ఉంది



స్పెల్‌బీ కాంపిటీషన్ పరీక్ష చాలా ఆసక్తికరంగా ఉంది. మాలో దాగిఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు ఇలాంటి కాంపిటీషన్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. స్పెల్‌బీ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు పదజాలం మెరుగుపడుతుంది.

- రిషిత, 10వ తరగతి

టీచర్లు ప్రోత్సహించారు



స్పెల్‌బీ లాంటి పరీక్ష రాయడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఉపాధ్యాయినులు ప్రోత్సహించారు. స్పెల్‌బీ తమలోని ప్రతిభను వెలికితీయడానికి, పదజాలం మెరుగుపర్చుకోవడానికి దోహదపడుతుంది. స్పెల్‌బీ నిర్వహించిన సాక్షికి కృతజ్ఞతలు.

-రుూన్సీరాణి, 10వ తరగతి

స్పెల్‌బీతో చాలా నేర్చుకున్నా..



సాక్షి నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష ద్వారా తాను చాలా నేర్చుకున్నాను. స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం ద్వారా పోటీ పరీక్షలంటే భయం పోయింది. ఇలాంటి పరీక్షలు రాయడం ద్వారా మాలో ఆత్మవిశ్వాసంతో పాటు ఇంప్రూవ్‌మెంట్ పెరుగుతుంది. ఇలాంటి పోటీ పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

- నందిని, 10వ తరగతి

ధాన్యం ఎగుమతి బాధ్యత రైతులదే

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐనవోలు: ధాన్యం తూకమయ్యి లారీలో ఎగుమతి అయ్యే వరకు రైతులదే బాధ్యత అని, అక్కడి నుంచి దిగుమతి అయ్యే వరకు బాధ్యత అధికారులదని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. మండలంలోని కొండపర్తి గ్రామంలో సెర్ప్, పౌరసరఫరాల శాఖ, సరస్వతి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అరకిలో ధాన్యం కూడా తరుగు పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వంలో జరగనివ్వబోమని చెప్పారు. 17 శాతం తేమ ఉండి తాలు లేకుండా కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురావాలని సూచించారు. గ్రేడ్ ఏ రకానికి రూ.2,320, దొడ్డు రకానికి రూ.2,300 కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా 31 రకాల సన్న ధాన్యాలకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో రుణమాఫీ అందరికి వచ్చిందా అని ఎమ్మెల్యే రైతులను అడుగగా రుణమాఫీ వచ్చిన వారికంటే రాని వారి సంఖ్య ఎక్కువగా ఉందంటూ రైతులు తెలిపారు. కుటుంబ గుర్తింపు, ఆధార్, బ్యాంక్ అకౌంట్లలో పొరపాట్లు తదితర సాంకేతిక కారణాలతో మాత్రమే ఆగిపోయిందని, రెండు నెలల్లో అందరికీ రుణమాఫీ అవుతుందన్నారు. డీఆర్డీఓ నాగ పద్మజ, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఏఓ విక్రమ్ కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఎం శ్రీలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

నడికూడ : మండలంలోని వెంకటేశ్వర్లపల్లి చైతన్య గ్రామైఖ్య సంఘం, రామకృష్ణపూర్ మహేశ్వరి మహిళా గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ నాగరాజు, పరకాల వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు.

స్థానిక సంస్థల్లో ఆదరించాలి

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రజలను కోరారు. సోమవారం భీమదేవపల్లి మండలం ముల్కనూరులో ఏర్పాటు చేసిన మండల కౌన్సిల్ సమావేశం రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. విద్య, వైద్యం, పేదవారికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలన్నారు. రైతులకు రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. రుణమాఫీ విషయంలో అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తిరుపతి, రమేశ్, కుమారస్వామి, కిషన్, కృష్ణారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు కాంగ్రెస్‌కు కనిపించవు..

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించవా అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతుల మద్దతు కోరిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క గింజ కొనలేదని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతుల పంటలు మిల్లులకు చేరకముందే గన్నీ సంచులు పంపించి మిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ వంటి ఏర్పాట్లు చేసి ప్రతి గింజను కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతుల కోసం ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలు ఆపారు కానీ రైతుబంధు ఆపలేదని గుర్తు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, మాజీ జెడ్పీటీసీలు కల్యాణి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని గుండేడు, కన్నూరు, భీంపల్లి, ఉప్పల్, ఉప్పలపల్లి, దేశరాజుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, కమలాపూర్, గూడూరు, అంబాల, శ్రీరాములపల్లి, మాదన్నపేట, శనిగరం, గోపాల్‌పూర్, నేరెళ్ల, వంగపల్లి, పంగిడిపల్లి, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

డీఈ సామ్యానాయక్



దామెర : విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

దామెర / కమలాపూర్ : విద్యుత్ ప్రమాదాలపై రైతులు అవగాహన కలిగి ఉండి వాటిని నివారించాలని హనుమకొండ రూరల్ డీఈ సామ్యానాయక్ సూచించారు. దామెర మండలంలోని సింగరాజుపల్లిలో, కమలాపూర్ మండలంలోని ఉప్పల్, గూడూరు గ్రామాల్లో పొలంబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేశారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. ప్రతీ రైతు విద్యుత్ మోటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని అన్నారు. గృహ అవసరాల నిమిత్తం ఎర్తింగ్ సరిగా ఉండే విధంగా చర్యలు తీసుకుని, షాట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. సర్వీస్‌వైర్లు ఇంటి ఆవరణలోని రేకులషెడ్లకు, దండెంవైర్లకు తగలకుండా చూసుకోవాలని అన్నారు. విద్యుత్ సమస్యలు, ప్రమాదాలు సంభవిస్తే సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పరకాల ఏడీఈ దేవేందర్, ఏఈ రమేశ్, లైన్ ఇన్‌స్పెక్టర్లు రవీందర్, వేణుగోపాల్, లైన్‌మెన్లు మనోహర్, రవీందర్, గిరిబాబు, ఏఎల్‌ఎంలు కృష్ణ, రమేశ్, జేఎల్‌ఎంలు రాజశేఖర్, రఘు, వేణు, పూర్ణచందర్, సురేష్, ప్రభాకర్‌రెడ్డి, శంకర్, కమలాపూర్ మండలంలో నిర్వహించిన పొలంబాట కార్యక్రమంలో ఏడీఈ వంశీకృష్ణ, ఏఈలు రాములు, సంపత్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, లైన్‌మెన్ విజేందర్, మహేందర్, సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టా మార్పిడి చేయాలని ధర్నా



క్రషర్‌కు వెళ్లే రోడ్డులో ధర్నా చేస్తున్న బాధితుడు, మద్దతు తెలుపుతున్న రైతులు

శాయంపేట : తన తండ్రి కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా ఓ క్రషర్ వ్యాపారి అక్రమంగా పట్టా పొందాడని, దాన్ని తొలగించి తన భూమిని తనకు అప్పగించాలని రాయిని ప్రసన్నకుమార్ అనే రైతు సోమవారం క్రషర్‌కు వెళ్లే దారిలో ధర్నా నిర్వహించాడు. బాధిత రైతు ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన రాయిని శ్రీనివాస్ 2001 సంవత్సరంలో ముప్పు ధనుంజయ వద్ద నుంచి సర్వే నంబర్ 638లో ఎకరం 14 గుంటల భూమి కొనుగోలు చేశాడు. ఇదే భూమిని 2019 జులై 15న బాలాజీ క్రషర్ యాజమాని గండ్ర భూపాల్ రెడ్డితో లీజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అతడు ఉన్నత విద్యనభ్యసించేందుకు పట్టణాలకు వెళ్లాడు. ఈ క్రమంలో తండ్రి చనిపోవడంతో తన పేరుపై పట్టా మార్పిడికి సాదాబైనామాలో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మరో క్రషర్ యాజమాని రవీందర్ రావు అక్రమంగా ఎకరం 12 గుంటల తన భూమిని పట్టా చేసుకున్నట్లు తెలిపారు. విషయం చేసుకున్న సదరు బాధితుడు భూమిని తన పేరుపై పట్టా చేయాలని పలుమార్లు అడిగినా రేపు, మాపు అంటూ కాలయాపన చేశాడని తెలిపారు. తన భూమిపై సర్వే చేపిస్తే సర్వేయర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి రిపోర్టు ఇవ్వకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపించాడు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం క్రషర్లకు వెళ్లే దారికి అడ్డుగా చెట్ల కొమ్మలు వేసి నిరసన తెలిపినట్లు పేర్కొన్నాడు. తోటి గ్రామ రైతులు తనకు మద్దతు తెలిపారన్నారు. ఇప్పటికైనా తన తండ్రి భూమిని తనపై పట్టా చేయాలని ప్రసన్నకుమార్ డిమాండ్ చేశాడు.

ఆలయ పున:ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలో నూతనంగా పున:నిర్మిస్తున్న పార్వతీదేవిసమేత మహాదేవ పంచకూట శివాలయ పున:ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పున:నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పంచకూట శివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామస్తులు, దాతల సహకారంతో, కమిటీ సమన్వయంతో ఆలయాన్ని పున: నిర్మించుకున్నట్లు తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వరకు పున:ప్రతిష్ఠాపన కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రవీందర్‌శర్మ, శ్రావణ్‌శర్మ, మాజీ సర్పంచ్ రాజు, కమిటీ సభ్యులు రఘు, సాంబరెడ్డి, తిరుపతిరెడ్డి, కిశోర్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, సాగర్, సంపత్, సత్యనారాయణ, సుదర్శన్, కుమారస్వామి, శివప్రసాద్, జయ్‌పాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు సహకరించాలి



నడికూడ : మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి



పరకాల : హాజరైన అధికారులు, ఎన్యుమరేటర్లు



వేలేరు : మాట్లాడుతున్న మల్లయ్య

నడికూడ : సమగ్ర ఇంటింటి సర్వేకు అందరు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మురళీధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్‌లకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిర్దేశించిన గడువులోపు తప్పులు లేకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఎలాంటి తప్పొప్పులకు తావివ్వకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిర్రబోయిన శ్రీనివాస్, ఎంపీఓ చేతన్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ హనుమత్ రావు, ఎంపీఎస్‌ఓ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరకాల : సమగ్ర ఇంటింటి సర్వే చేసేందుకు ఎంపికైన ఎన్యుమరేటర్లుకు పట్టణంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మ తెలిపారు. ప్రభుత్వం పొందుపర్చిన అంశాలపై, పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు.

వేలేరు : ఈనెల 6 నుంచి మండల వ్యాప్తంగా చేపట్టనున్న ఇంటింటి కులగణన సర్వేను నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి మల్లయ్య అధికారులకు, ఎన్యుమరేటర్లకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎన్యుమరేటర్లకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల, ఏఎస్‌ఓ జ్యోతి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఐనవోలు : పేకాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. కక్కిరాలపల్లి గ్రామంలోని ఎస్సీ కాలని పోచమ్మ గుడి సమీపంలో పేకాడుతున్నారనే సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పేకాట స్థావరంపై దాడులు నిర్వహించగా రూ.1,910 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వినతిపత్రం అందజేత



కమలాపూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందించారు. కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకెళ్తే కొనే దిక్కు లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శోభన్‌బాబు, కోటేశ్వర్, ప్రసాద్, కుమారస్వామి, రమేశ్‌బాబు, ఆదిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, సదానందం, కుమార్, మొగిలి, సాంబయ్య, ఓదెలు, శంకర్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు పెంచాల ఆగయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సోమవారం దశదినకర్మకు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ స్పీకర్, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి హాజరై ఆగయ్య చిత్రపటానికి పూలమాల వేశారు.


కుటుంబ వ్యవస్థ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఇందిర

కమలాపూర్ : కుటుంబ వ్యవస్థల బలోపేతానికి సర్వోదయ సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ ట్రెనింగ్ కో ఆర్డీనేటర్ ఇందిర అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని సెర్ప్ (ఐకేపీ) కార్యాలయంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు లింగాధారితహింస నివారణ, మహిళా రక్షణ వ్యవస్థల అనుసంధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కుటుంబం సంతోషంగా ఉన్నప్పుడే సమాజంలో శాంతి, పరస్పర సేవాభావం కలిగి ముందు తరాలకు కుటుంబ వ్యవస్థపై గౌరవం, నమ్మకం కలుగుతుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, మొబైల్ వాడుతున్న యువతి, యువకుల ఫోన్లను తల్లిదండ్రులు తరచూ పరిశీలించాలన్నారు. హనుమకొండ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత మాట్లాడుతూ.. సర్వోదయ సంస్థ మూడేళ్లుగా పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం చేస్తున్న కృషి చేయడం అభినందనీయమన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు గ్రామ స్థాయిలో సంస్థ ఏర్పాటు చేసిన మహిళా సహాయక కమిటీలు ఎంతో దోహదం పడుతాయన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్, పోలీస్, స్వధార్ హోమ్స్ సంస్థల అనుసంధానంతో మహిళల సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని, మహిళలు చట్టాలపై, వ్యవస్థలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, వీఏఓ కవిత, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, సీసీలు సదాలక్ష్మి, సుజాత, ప్రవంతి పాల్గొన్నారు.

విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఐనవోలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని, విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైతు సంఘం మండల నాయకుల సమావేశం మడిగె నాగరాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం విద్యుత్ నష్టాన్ని తగ్గించి చూపేందుకు వ్యవసాయ పంపుసెట్ల వినియోగంపై అదనపు వినియోగాన్ని చూపుతుందని ఆక్షేపించారు. పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న అవకతవకలను గ్రామీణ ప్రాంత వినియోగదారులపై మోపుతుందని ఆరోపించారు. జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి లింగయ్య, ఉపేందర్, మోహన్, నారాయణరెడ్డి, ఉప్పలయ్య, మహేందర్, బాబురావు, నర్సయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నప్రసాద వితరణ

పరకాల : పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస వేడుకలు ఘనంగా జరిగాయి. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పాడిపంటలు పండాలని ఈ సందర్భంగా ధర్మారెడ్డి ఆకాంక్షించారు.

పాఠశాలల మూసివేత సరికాదు

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను స్వాగతిస్తున్నామని, కానీ కులగణన పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఒకపూట మూసివేయడం సరికాదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి అన్నారు. మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన సర్వేకు ప్రాథమిక పాఠశాలల్లోని మొత్తం ఉపాధ్యాయులకు విధులు అప్పగించి మధ్యాహ్నం పాఠశాలలకు సెలవు ఇవ్వడం సరికాదని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్యను గుర్తించి అన్ని పాఠశాలల పనివేళలకు ఆటంకం కలుగకుండా విధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, మండల బాధ్యులు భాస్కర్, రాజు, చంద్రమౌళి, భిక్షపతి పాల్గొన్నారు.